బెదిరింపులకు భయపడి
ఏ ఉద్యమం ఆగకూడదు.
నా పత్రికా ఉద్యమం అంతే !
☛ ఎడిటర్

email: aksharabhoomignt@gmail.com
RNI NO: APBIL/2011/37440
Post Regd No. GTR/90/2025-27

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక

Publishing From Guntur. Curculated at Krishna, Prakasam, East & West Godavari, Vizag, Nellore, Kurnool, Hyderabad,Tirupathi, Ananthapuram, Kadapa

విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
అక్షరభూమి
ద్విభాషా దినపత్రికకు అన్ని మండలాలకు, మున్సిపాలిటీలకు విలేఖరులు కావలెను.
బిల్లారాజు
సెల్: 72074 22333

సంపుటి : 16 సంచిక : 26 గుంటూరు ద్విబాషా దినపత్రిక (తెలుగు మరియు ఇంగ్లీష్) బుధవారం, 25 నవంబర్ 2026 పేజీలు : 4 వెల : రూ. 2/-

వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు కార్యాచరణ

పెట్టుబడుల ఆకర్షణకు హార్టికల్చర్ సమిట్.. రూ.లక్ష కోట్ల సమీకరణ లక్ష్యం
వచ్చే ఖరీఫ్ నుంచే ముందస్తు సాగు ప్రణాళికలు సిద్ధం చేయాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబరు 24 అక్షర భూమి: రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునికంగా, లాభసాటిగా తీర్చిదిద్ది రైతుల ఆదాయం పెంచేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగంపై నిర్వహించిన సమీక్షలో పలు కీలక సూచనలు చేశారు. ప్రతి పంట సీజన్‌కు ముందుగానే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.వ్యవసాయంలో సంప్రదాయ విధానాలతో పాటు ఆధునిక సాంకేతికతను విస్తృతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వాతావరణ మార్పులు, తుపాన్ల ప్రభావాన్ని తట్టుకునే విధంగా పంటల సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాలని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచే ముందస్తు సాగుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రూ.లక్ష కోట్ల పెట్టుబడుల సమీకరణ

వ్యవసాయ రంగ అభివృద్ధికి భారీగా పెట్టుబడులు సమీకరించాలని చంద్రబాబు సూచించారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో రూ.40 వేల కోట్లు సమీకరించేలా ప్రణాళికలు రూపొందించాలని, ఇతర పెట్టుబడుల ద్వారా మరో రూ.60 వేల కోట్లు తీసుకురావాలని పేర్కొన్నారు. మొత్తం రూ.లక్ష కోట్ల నిధులతో వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు, ఆధునిక సాగు విధానాలు, రైతులకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. -2లో..

రాజీవ్‌కు ప్రాణహాని జరగాలనే.. గతంలో భద్రత తొలగింపు: సోనియాగాంధీ

న్యూఢిల్లీ, అక్షర భూమి :తన భర్త, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రాణాలకు హాని తలపెట్టేందుకు.. గతంలో ఉద్దేశపూర్వకంగానే సెక్యూరిటీని తొలగించారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆరోపించారు. ఆ సమయంలో తన కుటుంబం ఎంతో ఆందోళన చెందిందని పేర్కొన్నారు. నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో జరిపిన సంభాషణను ఆమె 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.'రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు వివిధ రాష్ట్రాలలో పర్యటనలకు వెళ్లేవారు. అటువంటి సమయంలో కొందరు కుట్రపూరితంగా ఆయనపై దాడులకు పాల్పడేవారు. అయినప్పటికీ ఆ సమయంలో ఉద్దేశపూర్వకంగానే భద్రతను తగ్గించారు. 1991 మార్చిలో రాజీవ్ ఓపెన్ జీపులో బిహార్‌లో ప్రయాణిస్తుండగా అల్లరి మూకలు ఆయనపై రాళ్లు రువ్వాయి. ఆయన పర్యటనను అడ్డుకోవడానికి కొందరు నిరసనలు చేపట్టారు. అది చాలా భయంకరమైన సందర్భం. ఆ పర్యటనకు తన తండ్రితో పాటు వెళ్లిన రాహుల్ . రాళ్ల దాడిని, నిరసనలను ప్రత్యక్షంగా చూశాడు. ఇంటికి రాగానే నా దగ్గరకు వచ్చి ఏడ్చాడు. నాన్న భద్రత కోసం మనం ఏమీ చేయకపోతే.. ఆయన ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన చెందాడు. మేమంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యాం. అంత జరిగినా అప్పటి ప్రభుత్వం రాజీవ్‌కు సెక్యూరిటీ పెంచలేదు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆయన ప్రాణాలు కోల్పోయారు' అని సోనియా పేర్కొన్నారు.

బీజేపీ--అకాలీదళ్ కలయిక పంజాబ్‌కు అవసరం: అమిత్ షా

- సుఖ్‌బీర్ బాదల్‌కు ఎన్డీఏలోకి స్వాగతం
- గురునానక్ జయంతి సందర్భంగా ప్రకటన
- మాదకద్రవ్య రహిత పంజాబ్ నిర్మాణమే లక్ష్యం
- రైతుల సమస్యలు, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం

2



సుబ్బంపేట మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేయాలి: పవన్ కళ్యాణ్

కాకినాడ, అక్షర భూమి : కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండల పరిధిలోని సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. మత్స్యకారుల ఆచూకీ తెలియకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ఘటనకు సంబంధించిన వివరాలతో పాటు ఇప్పటివరకు చేపట్టిన గాలింపు చర్యల గురించి కాకినాడ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. గల్లంతైన వారిని సురక్షితంగా గుర్తించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో ప్రయత్నాలు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4వ తేదీన మత్స్యకారులు కాకినాడ నుంచి బోటులో వేటకు బయలుదేరారు. ఈ నెల 10వ తేదీన విశాఖపట్నం హార్బర్‌కు చేరుకుని తమ వద్ద ఉన్న చేపలను విక్రయించారు. అదే రోజు తిరిగి సముద్రంలోకి వెళ్లారు. ఈ నెల 14వ తేదీ వరకు వారు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు.మత్స్యకారులు ప్రయాణించిన బోటు ఈ నెల 18వ తేదీ వరకు ఒడిశాలోని పారాదీప్ పోర్టు సమీపంలో కనిపించినట్లు విచారణలో గుర్తించారు. ఆ తర్వాత బోటు ఆచూకీ కూడా తెలియకుండా పోయిందని



కలెక్టర్ వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని, కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్ గార్డు అధికారులను సంప్రదించి సహకారం కోరినట్లు తెలిపారు.

అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి కీలక ముందడుగు

- మచిలీపట్నం, రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి ప్రణాళికలు
- విజయవాడ విమానాశ్రయంలో అంతర్జాతీయ కార్గో టెర్మినల్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి



అమరావతి, అక్షర భూమి : అమరావతి ఎకనామిక్ రీజియన్ (AER) అభివృద్ధి ప్రణాళికలో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య, రవాణా రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో సరుకు రవాణా, ఎగుమతులు, దిగుమతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పోర్టులు, విమానాశ్రయాలు, రవాణా, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై మంగళవారం రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో తొలి రౌండ్ టేబుల్ -2లో..

ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి..

అనంతపురం అభివృద్ధికి సహకరించాలి: మేయర్ రమేష్ గౌడ్

- ఎన్నికల్లో రిగ్గింగ్, బూత్ క్యాప్చరింగ్ జరిగాయని ఆరోపణలు
- కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ విమర్శలు
- కూటమి నేతల వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం
- విమానాశ్రయం, రైల్వే జంక్షన్ ఏర్పాటుకు సవాల్



అనంతపురం, అక్షర భూమి : ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడినా ఓటమి తప్పలేదని, ఆ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు కూటమి నాయకులు ఆవేశపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని అనంతపురం నగర మేయర్ రమేష్ గౌడ్ విమర్శించారు. నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియపై ఆరోపణలు చేశారు. -2లో..

తిరుమల భక్తులకు రూ.2 లక్షల సహజ మరణ బీమా



తిరుమల, అక్షర భూమి : తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భరోసా కల్పిస్తోంది. భక్తుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 'శ్రీవారి యాత్ర సురక్ష' పేరుతో ప్రత్యేక బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద తిరుమలలో సహజంగా మరణించిన భక్తుల కుటుంబాలకు రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల బీమా పరిహారం అందించనున్నారు. దేశంలోనే తొలిసారిగా ఇటువంటి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. ఈ పథకం ద్వారా తిరుమల యాత్ర సమయంలో అనుకోని విషాదం ఎదురైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. సహజ మరణం పొందిన ఏడుగురు భక్తుల కుటుంబాలకు ఇప్పటికే ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున బీమా చెక్కులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తుల కుటుంబాలకు ఆపత్కాలంలో ఆర్థిక సహాయం అందించే విధంగా బీమా సదుపాయాన్ని రూపొందించినట్లు వివరించారు.ముందుగానే దర్శన టికెట్లు బుక్ చేసుకున్న భక్తులతో పాటు ఎలాంటి ముందస్తు టికెట్ లేకుండా నేరుగా తిరుమలకు వచ్చే భక్తులకూ ఈ పథకం వర్తిస్తుంది. టికెట్లు లేని భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సాంకేతిక వ్యవస్థ ద్వారా వారిని గుర్తించి బీమా పరిధిలోకి తీసుకువస్తారు. దీంతో దర్శన టికెట్లు ఉన్నవారికే కాకుండా, నేరుగా వచ్చే భక్తులకూ ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. భక్తులతో పాటు తిరుమలలో సేవలందించే శ్రీవారి సేవకులకూ ఈ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు సహాయం చేయడం, వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి బాధ్యతలు నిర్వహించే సేవకులకు కూడా ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల తిరుమల యాత్రకు వచ్చే భక్తులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వాలంటీర్లకు అదనపు భరోసా లభించనుంది.తిరుమలకు నిత్యం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. రద్దీ, ప్రయాణం, వయోభారం వంటి కారణాలతో యాత్ర సమయంలో అనుకోని ఘటనలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు బీమా పరిహారం కొంత ఆర్థిక తోడ్పాటును అందించనుంది. 'శ్రీవారి యాత్ర సురక్ష' పథకం ద్వారా భక్తుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇస్తున్నామని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు.

మచిలీపట్నంలో ఈ-వ్యర్థాల సేకరణ వాహనాలు ప్రారంభం



మచిలీపట్నం, అక్షర భూమి మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఈ-వ్యర్థాల సేకరణ, నిర్వహణను మెరుగుపరిచేందుకు నూతన వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర ఈ వాహనాలను ప్రారంభించారు. నగరంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, అందులో భాగంగా కొత్త వాహనాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మేయర్ అబ్దుల్ అబిదా, డిప్యూటీ మేయర్ కొట్టే వెంకట్రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ ఇన్‌చార్జి పంతం జగేంద్ర పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత నాయకుల సమక్షంలో వాహనాలను ప్రారంభించి మున్సిపాలిటీ సేవలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఇళ్లలో, కార్యాలయాల్లో వినియోగం ముగిసిన ఎలక్ట్రానిక్ వస్తువులను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించడం ఈ-వ్యర్థాల నిర్వహణలో కీలకం. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు,

బీజేపీ--అకాలీదళ్ కలయిక పంజాబ్‌కు అవసరం: అమిత్ షా



న్యూఢిల్లీ, అక్షర భూమి : భారతీయ జనతా పార్టీ, శిరోమణి అకాలీదళ్ మధ్య మళ్లీ రాజకీయ బంధం బలపడింది. ఈ రెండు పార్టీల కలయిక కేవలం రాజకీయ పొత్తు మాత్రమే కాదని, ఉమ్మడి వారసత్వం, లక్ష్యాలు, పంజాబ్ అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతతో ఏర్పడిన సహజమైన అనుబంధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారు. గురునానక్ దేవ్ జయంతి పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్, ఆయన సహచరులను తిరిగి ఎన్డీఏలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు.బీజేపీ, అకాలీదళ్ మధ్య గతంలో ఉన్న రాజకీయ అనుబంధం 2020లో వ్యవసాయ చట్టాల వివాదం కారణంగా తెగిపోయింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత రెండు పార్టీలు మళ్లీ చేతులు కలిపాయి. 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. ఈ కలయిక పంజాబ్‌లో శాంతి, సామరస్యం, అభివృద్ధికి దోహదపడుతుందని అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడం ఎన్డీఏ ప్రధాన ప్రాధాన్యమని అమిత్ షా స్పష్టం చేశారు. గ్యాంగ్‌స్టర్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు పటిష్టమైన చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం, రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపడం తమ కార్యాచరణలో ముఖ్యమైన అంశాలని వివరించారు. పంజాబ్‌లో శాంతిభద్రతలను మెరుగుపరచడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా కృషి చేస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మాదకద్రవ్యాల సమస్యను పూర్తిగా నిర్మూలించి, సురక్షితమైన, అభివృద్ధి చెందిన, సుభిక్షమైన పంజాబ్‌ను నిర్మించేందుకు కట్టుబడి ఉన్నామని అమిత్ షా పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తమ సందేశాన్ని తీసుకెళ్లేలా బీజేపీ, అకాలీదళ్ కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రంలో అభివృద్ధి, భద్రతకు సంబంధించిన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.గురునానక్ దేవ్ జయంతి రోజున రెండు పార్టీల కలయిక ప్రకటించడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో కలిసి పనిచేసిన అనుభవం, ఉమ్మడి రాజకీయ వారసత్వం తమ బంధానికి పునాది అని ఇరు పార్టీల నాయకత్వం పేర్కొంది. పంజాబ్‌లో మాదకద్రవ్యాల నిర్మూలన, రైతుల సమస్యలు, ఆర్థిక పురోగతి వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లనున్నట్లు అమిత్ షా వెల్లడించారు.

స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజల పట్టం.. వైసీపీకి భవిష్యత్తు లేదు

సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే వైసీపీకి 6 శాతం ఓట్లు తగ్గాయి.. రెండేళ్ల కూటమి పాలనకు ప్రజల మద్దతే నిదర్శనం: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ నవంబర్ 24. అక్షర భూమి.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే వైసీపీకి 6 శాతం ఓట్లు తగ్గాయని, భవిష్యత్తులో రాష్ట్రంలో ఆ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని వ్యాఖ్యానించారు. వినుకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కొన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి ఆదరణ లభించదనే భయంతో వైసీపీ నాయకులు పోటీకి ముందుకు రాలేదని, కూటమి అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలి పార్టీకి ప్రజలు ఓట్ల రూపంలో గట్టి సమాధానం చెప్పారని విమర్శించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వస్తున్న ప్రజాదరణ అద్దం పడుతోందన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు తాగు, సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామపంచాయతీల్లో కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వినుకొండ మున్సిపల్ చైర్మన్ చెరుకుపాలెం షమీంఖాన్‌తో పాటు వార్డు కౌన్సిలర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించిన పట్టణ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.పల్నాడు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించి కూటమి ప్రభుత్వం వారికి సముచిత ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమన్నారు. పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతలు హింసను ప్రేరేపించడం, తప్పుడు ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వినుకొండ నియోజకవర్గంలో సర్పంచ్ ఎన్నికల్లో 96 శాతం కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే సస్పెన్షన్

నియోజకవర్గంలోని పంచాయతీల్లో టీడీపీ రెబల్స్‌గా పోటీ చేస్తున్నవారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. రెబల్స్ పోటీ నుంచి తప్పుకుని కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారి జాబితాను సస్పెన్షన్ చర్యల నిమిత్తం అధిష్ఠానానికి పంపినట్లు వెల్లడించారు.

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై బొల్లా వ్యాఖ్యలు ఖండన

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామని జీవీ ఆంజనేయులు తెలిపారు. వైసీపీ హయాంలో పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థులను బెదిరించి, బలవంతంగా నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేసిన నీచ సంస్కృతి బొల్లాదేనని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం వైసీపీకి లేదని వ్యాఖ్యానించారు.

వినుకొండ ఆలయాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ప్రత్యేక పూజలు

- స్వాములకు స్వయంగా సద్ది వడ్డించిన చీఫ్ విప్ జీవీ





వినుకొండ నవంబర్ 24. అక్షర భూమి.ఆకార్తీక పౌర్ణమి సందర్భంగా వినుకొండ పట్టణంలోని ఆలయాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పాత శివాలయంలో పరమ శివుని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో స్వాములకు, భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మార్కాపురం రోడ్డులోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్షాపరులకు ఆయన స్వయంగా సద్ది (భోజనం) వడ్డించారు. పవిత్ర కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, భగవంతుని కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు,కౌన్సిలర్లు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో ఈ-వ్యర్థాల సేకరణ వాహనాలు ప్రారంభం

బ్యాటరీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక వాహనాల ఏర్పాటు స్థానికంగా ఈ-వ్యర్థాల సేకరణ వ్యవస్థను బలోపేతం చేయనుంది. మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్లలో పేరుకుపోయే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సాధారణ చెత్తలో వేయకుండా, ప్రత్యేక సేకరణ వ్యవస్థకు అందించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు.స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా మచిలీపట్నంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నూతన ఈ-వ్యర్థాల వాహనాల ద్వారా నగరంలో వ్యర్థాల సేకరణకు మరింత సౌలభ్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు కార్యాచరణ

పెట్టుబడుల కోసం హార్టికల్చర్ సమిట్

ఉద్యానవన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా హార్టికల్చర్ సమిట్ నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ రంగంలో ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించి, కొత్త పెట్టుబడులు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. హార్టికల్చర్‌కు సంబంధించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగు, వాటి ఉత్పత్తుల మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.


ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించేలా రైతులను ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు తుపాన్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని రైతులకు వివరించాలని అధికారులకు తెలిపారు. ప్రత్యామ్నాయ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించి, వాటిని ఆచరణలోకి తీసుకువచ్చేలా ప్రోత్సహించాలని చెప్పారు.

రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని చంద్రబాబు పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, పంటల సాగు, తెగుళ్ల నివారణ, మార్కెట్ అవకాశాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని పెంచడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించి, ఉత్పాదకతను పెంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని తగ్గించడం, పెట్టుబడులను ఆకర్షించడం, వ్యవసాయాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఎన్నికల అధికారులకు వైసీపీ లీగల్ నోటీసులు



అమరావతి, అక్షర భూమి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్, డీజీపీ సహా పలువురు ఉన్నతాధికారులకు లీగల్ నోటీసులు జారీ చేసింది. పార్టీ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మెహఫూజ్ నజ్కీ ఈ నోటీసులు పంపినట్లు వైసీపీ వెల్లడించింది. అక్టోబర్ 27న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పలుచోట్ల తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని వైసీపీ ఆరోపించింది. పల్నాడు, కడప, తిరుపతి, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల్లో దాడులు, బెదిరింపులు, నిర్బంధాలు, నామినేషన్ల అడ్డగింతలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. ఇలాంటి ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ పరిశీలించి, అవసరమైన చోట నామినేషన్ల గడువును పొడిగించాలని కోరింది. అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లోనూ నామినేషన్లు సమర్పించే అవకాశం కల్పించాలని సూచించింది.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరింది. నామినేషన్ల దాఖలు కేంద్రాల్లో అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లోనూ భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేయాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు పార్టీ తెలిపింది. అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసుకునేలా పోలీసు యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేసింది. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలని వైసీపీ కోరింది. ఎన్నికల పిటిషన్ల దాఖలుకు గడువు ముగిసే వరకు, పిటిషన్లు దాఖలైతే వాటి పరిష్కారం పూర్తయ్యే వరకు ఈ దృశ్యాలను భద్రపరచాలని సూచించింది. అవసరమైనప్పుడు ఎన్నికల ట్రిబ్యునల్‌కు, సంబంధిత పిటిషన్‌లోని పక్షాలకు ఫుటేజీ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసింది.సీసీ కెమెరాల దృశ్యాలను తొలగించడం లేదా ధ్వంసం చేయడం జరిగితే కోర్టు ధిక్కరణ అంశం తలెత్తే అవకాశం ఉందని వైసీపీ నోటీసుల్లో హెచ్చరించింది.

అమరావతి ఎకనామిక్ రీజియన్

అభివృద్ధికి కీలక ముందడుగు

సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ రాహుల్ కుమార్ రెడ్డి, APEDB, APIIC, మారిటైమ్ బోర్డు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) ప్రతినిధులతో పాటు వివిధ ప్రైవేటు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో రవాణా, వాణిజ్య కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల అవకాశాలు, భవిష్యత్తు అవసరాలపై విస్తృతంగా చర్చించారు.

పోర్టులు, రవాణా అనుసంధానంపై దృష్టి

మచిలీపట్నం, రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు సమావేశంలో ప్రధాన చర్చనీయాంశంగా నిలిచాయి. ఈ పోర్టులను ప్రధాన వాణిజ్య కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నుంచి సరుకులను వివిధ ప్రాంతాలకు వేగంగా తరలించేందుకు ప్రత్యేక రవాణా మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని అధికారులు చర్చించారు. మచిలీపట్నం పోర్టును తూర్పు తీరంలో కీలక వాణిజ్య గేట్‌వేగా తీర్చిదిద్దాలని సురేశ్ కుమార్ సూచించారు. పోర్టుల అభివృద్ధికి అనుగుణంగా రోడ్డు, రైలు మార్గాల అనుసంధానాన్ని పటిష్ఠం చేయాలని పేర్కొన్నారు.

మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు

అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, కంటైనర్ రైలు టెర్మినల్స్ ఏర్పాటు అవకాశాలను సమావేశంలో సమీక్షించారు. వివిధ రవాణా మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా ఖర్చులు తగ్గించడంతో పాటు పరిశ్రమలకు అవసరమైన రవాణా సదుపాయాలను మెరుగుపరచవచ్చని అభిప్రాయపడ్డారు. విజయవాడ--గుంటూరు--అమరావతి ప్రాంతంలో ఆధునిక గిడ్డంగుల నిర్మాణానికి ఉన్న అవకాశాలు, అవసరమైన భూమి లభ్యత, సరుకు రవాణా అంచనాలు, పెట్టుబడుల సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

ఈ సందర్భంగా పెట్టుబడిదారులు భూమి లభ్యత, కస్టమ్స్ ఖర్చుల రికవరీ, భవిష్యత్తులో సరుకు రవాణా పరిమాణం తదితర అంశాలపై స్పష్టత కోరారు. లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన విధానపరమైన అంశాలు, మౌలిక సదుపాయాల కల్పనపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

విజయవాడ విమానాశ్రయంలో కార్గో టెర్మినల్

విజయవాడ విమానాశ్రయంలో అంతర్జాతీయ కార్గో టెర్మినల్ ఏర్పాటుపై సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆక్వా, ఉద్యానవన ఉత్పత్తుల ఎగుమతులకు విమాన రవాణా ఎంతో కీలకమని గుర్తించిన అధికారులు, ఈ రంగాలకు అవసరమైన ఎయిర్ కార్గో సదుపాయాలను అభివృద్ధి చేయాలని చర్చించారు. ముఖ్యంగా త్వరగా పాడయ్యే ఉత్పత్తులను నాణ్యత దెబ్బతినకుండా గమ్యస్థానాలకు చేర్చేందుకు కోల్డ్‌చైన్ సదుపాయాలను బలోపేతం చేయాలని సురేశ్ కుమార్ సూచించారు.

అంతర్గత జలరవాణా పునరుద్ధరణ

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అంతర్గత జలరవాణా మార్గాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం, సరుకు రవాణాకు అనువైన విధంగా అభివృద్ధి చేయడంపైనా సమావేశంలో చర్చించారు. రవాణా వ్యవస్థలో వివిధ మార్గాలను సమర్థంగా అనుసంధానం చేస్తూ సూక్ష్మస్థాయి లాజిస్టిక్స్ ప్రణాళికలను రూపొందించాలని సురేశ్ కుమార్ అధికారులకు సూచించారు. పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వే, రోడ్డు రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం పెంచడం ద్వారా అమరావతి ఎకనామిక్ రీజియన్ పరిధిలో వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించేలా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు.

ఎనిమిది రంగాలపై సమావేశాలు

అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధికి సంబంధించి మొత్తం ఎనిమిది రంగాలపై ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు సురేశ్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా లాజిస్టిక్స్, రవాణా, పోర్టులు, విమానాశ్రయాల రంగాలకు సంబంధించి తొలి సమావేశం పూర్తయిందని వెల్లడించారు. మిగిలిన ఏడు రంగాలకు సంబంధించిన సమావేశాలను కూడా త్వరలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక సంస్థలు, ప్రైవేటు పెట్టుబడిదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అమరావతి ఎకనామిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించనున్నట్లు వివరించారు.

ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలి..

ప్రజాభిప్రాయాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలపై వివాదం సృష్టించడం కంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు.నాలుగు సార్లు ఎంపీగా పనిచేసిన అనంత వెంకటరామిరెడ్డితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను లుచ్చా, లోఫర్ అంటూ సంబోధించడం సరికాదని రమేష్ గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి బాధ్యతల్లో ఉన్న నాయకులు మాట్లాడే మాటలు యావత్ జిల్లా నాయకత్వానికి ప్రతిబింబంగా ఉంటాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న నాయకులు ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలపై కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుకొండ్ల రాజేష్ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని, అనంతపురంలో ఓటు వేసిన అనంతరం కూడేరు మండలం కదరకుంట గ్రామంలోనూ ఓటు వేశారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి దాడులు చేయించారని మేయర్ ఆరోపించారు. తమ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలకు మోకాళ్లు, కాళ్లు, చేతులు విరిగి, తలలకు గాయాలై ఇప్పటికీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కౌంటింగ్ సమయంలో తమకు ఆధిక్యం వస్తున్న తరుణంలో నాలుగు టేబుళ్ల వద్ద లెక్కింపు ప్రక్రియను నిలిపివేశారని విమర్శించారు. తెల్లవారుజామున ఐదు గంటల వరకు అధికారులు, ఏజెంట్లు, తమ పార్టీ ప్రతినిధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రిగ్గింగ్, బూత్ క్యాప్చరింగ్ జరగకుండా ఉండి ఉంటే, చెల్లని ఓట్ల తొలగింపులో తమ పార్టీకి అన్యాయం జరగకపోయి ఉంటే 35 వేలకుపైగా మెజారిటీ సాధించేవారమని ఆయన అభిప్రాయపడ్డారు.ఓటమిని అంగీకరిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ సామాజిక మాధ్యమంలో ప్రకటించారని, అభ్యర్థి కూడా శుభాకాంక్షలు తెలిపిన పది రోజుల తర్వాత ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంపై రమేష్ గౌడ్ ప్రశ్నలు సంధించారు. ఈ వ్యవహారం కోర్టుకు వెళ్తే ఎన్నికల సమయంలో జరిగిన ఘటనలు, దౌర్జన్యాలకు సంబంధించిన సీసీ కెమెరాల దృశ్యాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. కౌంటింగ్ రోజున 10 వేల మందికిపైగా ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డపైకి రావడమే ప్రజాభిప్రాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. గెలిచినా గర్వం ఉండకూడదని, కులం, మతం, ప్రాంతం, పార్టీ తేడాలు లేకుండా అందరినీ కలుపుకొని పనిచేయాలని తమ నాయకుడు వైఎస్ జగన్ సూచించారని గుర్తుచేశారు.

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
RNI NO: APBIL/2011/37446
Post Regd No. GTR/90/2025-27
25 బుధవారం నవంబర్ 2026

ఈవీఎంలైనా, బ్యాలెట్ లైనా గెలుపు కూటమిదే :గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్




గుంటూరు, నవంబర్ 24. అక్షర భూమి. ఇది డబుల్ ఇంజన్ సర్కారు కాదని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో కూడి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బాగా బుద్ధి చెప్పారన్నారు. గతంలో ఈవీఎంలపై తమ ఓటమి నెపాన్ని నెట్టిన వైసీపీ, ఇప్పుడు బ్యాలెట్ పోరులోనూ బొక్క బోర్లా పడిందని తెలిపారు. ఇప్పుడు ఫలితాలను చూసి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సోషల్ ఇంజినీరింగ్ పేరిట జగన్ హయాంలో బీసీల రిజర్వేషన్ ను 24 శాతానికి తగ్గించి 16,800 మందికి రాజ్యాంగ పదవులు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని చెప్పారు. కోర్టులో బీసీల రిజర్వేషన్లపై అడ్డంకులు ఎదురైనప్పటికీ టీడీపీ 34 శాతం అభ్యర్థులకు టికెట్లు ఇచ్చిందనన్నారు. అదే సమయంలో విద్యావంతులతోపాటు మహిళలకు 50 శాతం టికెట్లు అందించి గౌరవించినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామీణ ప్రజలు కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం అధిగమించి ప్రజలకు మంచి చేస్తున్నారని చెప్పారు. ఎల్ నినోతోపాటు రెండు తుఫాన్ల సమయంలోనూ ప్రజలకు కూటమి అండగా నిలిచిందన్నారు. ఐక్యతకు మారుపేరు కూటమి నాయకత్వమని, అందుకే ప్రత్యర్థి పార్టీ రాష్ట్రంలో అడ్రస్ గల్లంతు అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కేవలం అక్షర క్రమంలోనే కాదు, అభివృద్ధిలోనూ నంబర్ వన్ స్థానంలో నిలవబోతోందని, రాష్ట్రానికి స్వర్ణయుగం రాబోతోందని చెప్పారు. జగన్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజల ఛీకొట్టారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అమరావతి రాజధాని నిర్మాణం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పరుగులు తీస్తున్నాయని తెలిపారు. యువత భవితను బంగారుమయం చేసేందుకుగాను రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల్లో 17 వేల మంది వైసీపీ తరఫున పోటీలో నిలిచారని, అయితే ప్రజలు కూటమికి 94 శాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందించారని తెలిపారు. తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి పథకం వంటి కార్యక్రమాలతో పేదలకు సంక్షేమాన్ని అందించామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి పాలనతో పంచాయతీలకు మహర్దశ వచ్చిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నామని తెలియజేసారు.

మాచర్ల విద్యార్థిని షేక్ సుమయ్యకు ఎన్టీపీసీ రాష్ట్రస్థాయి కన్సోలేషన్ బహుమతి ప్రధానం..!

- చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ

మాచర్ల, నవంబర్24 (అక్షరభూమి): మాచర్ల జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థిని షేక్ సుమయ్య ఎన్టీపీసీ సింహాద్రి సేవ్ పవర్ సెక్యూర్ ఫ్యూచర్ అనే అంశంపై రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో కన్సోలేషన్ బహుమతిని కైవసం చేసుకుంది.సోమవారం ఎన్టీపీసీ సింహాద్రి అనకాపల్లి గీతాంజలి నగర్ టౌన్షిప్ ఆడిటోరియంలో ఎన్టిపిసి ప్రతినిధి చేతులు మీదుగా రూ.7500 కన్సోలేషన్ బహుమతి ప్రైజ్ మనీ అందుకుంది. ఈ సందర్భంగా ఆ పాఠశాల గైడ్ టీచర్ ఆయేషా సుల్తానా మాట్లాడుతూ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న షేక్ సుమయ్య విద్యతో పాటు క్రీడలు, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలలో మంచి ప్రతిభ కనబరుస్తుందన్నారు. తమ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో బహుమతి అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ విజయంతో జడ్పీ గర్ల్స్ హైస్కూల్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకుందన్నారు. గతంలో సుమయ్య అక్క సాజిదా రెండుసార్లు కన్సోలేషన్ పొందినట్లు తెలిపారు. సాజిదా, సుమయా ఇద్దరూ సమీరా తోబుట్టువులని, సమీరా 2024-25లో కూడా 10వ తరగతిలో స్టేట్ సెకండ్ ర్యాంక్



సాధించి మాచర్ల మణిపూసగా పట్టణానికి మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకువచ్చినట్లు ఆమె తెలిపారు. ఆ విద్యార్థినుల తల్లిదండ్రులు షేక్ జాన్, అబిదాబేగం పిల్లలకు నింపుతున్న స్ఫూర్తి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రస్థాయి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థిని షేక్ సుమయ్యను పాఠశాల హెచ్ఎం ఉషారాణి, గైడ్ టీచర్ ఆయేషా సుల్తానా, ఇతర టీచర్లు, సిబ్బంది, అభినందించారు.

మొదటి దశ పంచాయతీ, బాపట్ల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం నేటితో ముగింపు

- జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



బాపట్ల(అక్షర భూమి)24.11.26 అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, హెచ్చరించారు. బాపట్ల మున్సిపాలిటీతో పాటు పర్చూరు నియోజకవర్గంలోని 6 మండలాల పరిధిలో నవంబర్ 26న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, నేడు మంగళవారం సాయంత్రం 5:00 గంటల తర్వాత ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని అభ్యర్థులు, ప్రజలకు స్పష్టం చేస్తూ జిల్లా ఎస్పీ మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.బాపట్ల జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికలు పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాం మండలాల్లో నవంబర్ 26న జరగనున్నాయి. అదే రోజు బాపట్ల మున్సిపాలిటీ ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నేటి సాయంత్రం 5:00 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసింది. మంగళవారం సాయంత్రం నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎవరూ ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని ఎస్పీ హెచ్చరించారు.మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గంలోని మొత్తం 95 గ్రామ పంచాయతీలకు గాను 33 మంది సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 62 గ్రామ పంచాయతీల్లో సుమారు 159 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అదేవిధంగా మొత్తం 970 వార్డులకు గాను 451 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 519 వార్డుల్లో 1,133 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో నేటి సాయంత్రం నుంచి అభ్యర్థులు గానీ, వారి తరఫున ఇతరులు గానీ ఎలాంటి ప్రచారం నిర్వహించడం నిషేధం. అదేవిధంగా బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని 44 వార్డులకు సంబంధించి 31 మంది మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులతో పాటు 347 మంది వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవనున్నారు. వీరంతా నేటి సాయంత్రం 5:00 గంటల నుంచి ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.ఎన్నికలు జరిగే ప్రాంతాలకు సంబంధం లేని ఇతర ప్రాంతాల వ్యక్తులు ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఉంటే, వారు తక్షణమే ఆయా ప్రాంతాలను విడిచివెళ్లాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు తెరవడానికి అనుమతి లేదు.మంగళవారం సాయంత్రం 5:00 గంటల తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదు, ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఉండరాదని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.జిల్లాలో ఎన్నికల నియమావళిలో పాటు పోలీస్ యాక్ట్ 30 కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నందున అనుమతి లేని సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. అనవసరంగా ప్రజలు గుంపులుగా గుమిగూడరాదని, ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడతారన్నారు. అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటిస్తూ ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

బాపట్ల బరిలో స్వతంత్రుల సవాల్!

ఐదు రోజుల ప్రచారంతో రాజకీయ పార్టీలకు చెమటలు.
మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలంతా బాపట్లలోనే మకాం వేయాల్సిన పరిస్థితి.. డబ్బుతో కాదు..
ప్రజాభిమానంతో పోరాడుతున్నాం: మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



బాపట్ల(అక్షర భూమి)24.11.26 బాపట్ల పురపాలక ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు దీటుగా స్వతంత్రుల ప్యానల్ను రంగంలోకి దించిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ప్రచార ముగింపు సభలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కేవలం నాలుగున్నర రోజుల ప్రచారంతోనే ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చిందని, బాపట్ల ప్రజల ఆత్మగౌరవం కోసం మొదలుపెట్టిన ఈ పోరాటం ఎన్నికలతో ముగిసేది కాదని స్పష్టం చేశారు.నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రచారానికి పూర్తిస్థాయి సమయం లేకపోయినా రోజుకు 25 నుంచి 32 కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేస్తూ పట్టణంలోని మెజారిటీ వార్డుల్లో పర్యటించామని తెలిపారు. చివరి రోజు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి ప్రజల నుంచి వచ్చిన స్పందన తమకు మరింత ఉత్సాహాన్నిచ్చిందన్నారు. తన నిర్ణయాన్ని ప్రజలు అర్థం చేసుకుని అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు.

ఒక మున్సిపాలిటీ కోసం ఇంతమంది నాయకులా?

బాపట్ల పురపాలక ఎన్నికల కోసం రాష్ట్రస్థాయి నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పట్టణంలో మకాం వేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని అన్నం సతీష్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సైతం బాపట్ల ఎన్నికల పరిస్థితిపై సమీక్షించే స్థాయికి ఈ పోటీ చేరిందని వ్యాఖ్యానించారు. ఒక పురపాలక సంఘం ఎన్నిక కోసం ఇంతమంది నాయకులు రావడం వెనుక తమ స్వతంత్ర ప్యానల్కు లభిస్తున్న ప్రజాదరణే కారణమని ఆయన అభిప్రాయపడ్డారు.తమ వద్ద ప్రచారం కోసం సినిమా నటులు లేరని, జబర్దస్త్ కళాకారులు లేరని, అధికార పదవుల్లో ఉన్న నాయకుల అండ లేదని పేర్కొన్నారు. ప్రజలే తమ బలమని, ప్రజల విశ్వాసమే తమ ప్రచార అస్త్రమని చెప్పారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఇప్పుడు స్వతంత్ర ప్యానల్ ప్రధాన పోటీగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

బెదిరింపులతో ఓట్లు సంపాదించాలనుకోవడం సరికాదు

ఇళ్ల పట్టాలు, ఇళ్ల తొలగింపు, రోడ్ల విస్తరణ పేరుతో పేద ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నం సతీష్ ఆరోపించారు. స్వతంత్ర అభ్యర్థులకు ఓటు వేస్తే అభివృద్ధి జరగదని, వారు గెలిచినా ఏమీ చేయలేరని ప్రచారం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి సైతం స్వతంత్ర అభ్యర్థుల గెలుపుపై సందేహాలు వ్యక్తం చేయడం సరైన విధానం కాదని విమర్శించారు. రాజకీయ పార్టీ గుర్తుతో గెలిచిన వారికే అభివృద్ధి చేసే హక్కు ఉంటుందా? స్వతంత్రంగా గెలిచిన కౌన్సిలర్కు ఎమ్మెల్యే, మంత్రి సహకరించరా? అని ప్రశ్నించారు.బాపట్లలో గతంలోనూ నాలుగు పర్యాయాలు స్వతంత్ర అభ్యర్థులు పురపాలక చైర్మన్లుగా ఎన్నికైన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధికి రాజ్యాంగబద్ధంగా ఉండే హక్కులు, బాధ్యతలు అందరికీ సమానమేనని స్పష్టం చేశారు.

దోమల పొగ ఎన్నికల వరకేనా?

బాపట్ల పట్టణంలో దోమల సమస్య తీవ్రంగా ఉన్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ప్రచారంలో ఈ సమస్యను ప్రస్తావించిన వెంటనే ఫాగింగ్ యంత్రాలు వీధుల్లోకి వచ్చాయని, సాయంత్రానికి పొగలు కనిపించాయని పేర్కొన్నారు. తాను సమస్యను లేవనెత్తగానే అధికారులు స్పందించాల్సి వచ్చిందని, మరి ఇంతకాలం ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎన్నికల రోజు వరకు మాత్రమే ఫాగింగ్ చేసి ఆ తర్వాత మళ్లీ వదిలేస్తారా? ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే నిరంతర పర్యవేక్షణ అవసరమని అన్నారు.తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు కాల్వల నిర్వహణ, వీధి దీపాలు, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలే ప్రజలకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డేటా సెంటర్లు, విమానాశ్రయాల హామీల కంటే ముందు ప్రజల ఇబ్బందులు పరిష్కరించాలని సూచించారు.

సామాన్యులకు రాజకీయ అవకాశం

తమ ప్యానల్లో కోటీశ్వరులకు కాకుండా సామాన్యులకు అవకాశం కల్పించామని అన్నం సతీష్ వివరించారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల జీతంతో పనిచేసే వ్యక్తులు, ఇంటింటికీ వంటలు చేసి జీవనం సాగించే మహిళలు, క్లినిక్లో నర్సుగా పనిచేసే యువతి, గతంలో వాలంటీర్గా పనిచేసిన మహిళకు కౌన్సిలర్గా పోటీ చేసే అవకాశం ఇచ్చామన్నారు. ఆర్థికంగా బలహీనమైనప్పటికీ ప్రజాసేవ చేయాలనే సంకల్పం ఉన్నవారిని ఎంపిక చేశామని తెలిపారు. మొత్తం 16 మంది అభ్యర్థులను బరిలోకి దించామని, అందులో 15 మంది గ్యాస్ సిలిండర్ గుర్తుపై, 29వ వార్డులో కొట్రా రేవతి ఉంగరం గుర్తుపై పోటీ చేస్తున్నారని వివరించారు.

డబ్బుతో కాదు.. ప్రజాభిమానంతో పోటీ

ఎన్నికల చివరి రోజుల్లో డబ్బు పంపిణీ, ప్రలోభాలు, బెదిరింపులు చోటుచేసుకునే అవకాశం ఉందని అన్నం సతీష్ వ్యాఖ్యానించారు. తమకు ఇతర పార్టీల మాదిరిగా డబ్బు ఖర్చు చేసే స్థోమత లేదని, ప్రజల ప్రేమాభిమానాలతోనే పోటీ చేస్తున్నామని చెప్పారు.ప్రజలు డబ్బు తీసుకున్నా తమ ఓటు విషయంలో మాత్రం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. డబ్బు పంపిణీ చేసి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచే వడ్డీతో సహా వసూలు చేసుకుంటారంటూ రాజకీయ పార్టీలపై విమర్శలు గుప్పించారు.**ఎన్నికల తర్వాత అసలు పోరాటం!**

ఈ ఎన్నికతో తన ప్రయాణం ఆగిపోదని, మరింత వేగంగా ప్రజల కోసం పనిచేస్తానని అన్నం సతీష్ ప్రకటించారు. తనపై ఎలాంటి విమర్శలు వచ్చినా, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా బాపట్లను వదిలి వెళ్లే ప్రసక్తి లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఎంతవరకైనా పోరాడతానని స్పష్టం చేశారు.చైర్మన్ అభ్యర్థి పేర్లి సునీల్ కుమార్ స్థానికుడని, విద్యావంతుడని, గతంలో కౌన్సిలర్గా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. ఆయనకు పురపాలక సంఘంపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు.ఈ నెల 26న జరిగే పోలింగ్లో చైర్మన్ అభ్యర్థి పేర్లి సునీల్ కుమార్కు కప్పు, సాసరు గుర్తుపై, 15 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు గ్యాస్ సిలిండర్ గుర్తుపై, 29వ వార్డు అభ్యర్థి కొట్రా రేవతికి ఉంగరం గుర్తుపై ఓటు వేయాలని కోరారు.ఐదు రోజుల ప్రచారంలో ప్రజల మనసులు గెలిచామని.. ఇప్పుడు ఎన్నికల ద్వారా ప్రజల తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని అన్నం సతీష్ ప్రభాకర్ పేర్కొన్నారు. బాపట్ల ఆత్మగౌరవం, ప్రజల హక్కులు, పట్టణ అభివృద్ధి కోసం తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ప్రకటిస్తూ ప్రచారానికి ముగింపు పలికారు.

బాపట్లలో అన్నం సతీష్ భారీ వాహన ర్యాలీ

పేర్లి సునీల్తో కలిసి ప్రచారం.. 44 వార్డుల మీదుగా వేలాది వాహనాలతో ర్యాలీ.. మారుమోగిన నినాదాలు

బాపట్ల(అక్షర భూమి)నవంబర్ 24:మున్సిపల్ ఎన్నికల వేళ బాపట్ల పట్టణంలో రాజకీయ సందడి నెలకొంది. మాజీ శాసనమండలి సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్, ఇండిపెండెంట్ చైర్మన్ అభ్యర్థి పేర్లి సునీల్తో కలిసి భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని 44 వార్డుల్లోనూ ర్యాలీ కొనసాగించారు. కొన్ని వేల వాహనాలతో సాగిన ఈ కార్యక్రమానికి ఇండిపెండెంట్ అభ్యర్థులు, వారి మద్దతుదారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ర్యాలీ సాగిన ప్రాంతాల్లో అన్నం సతీష్ ప్రభాకర్ పేరుతో నినాదాలు మారుమోగాయి.

44 వార్డుల్లో ర్యాలీ.. ఎన్నికల ప్రచారంలో జోరు

అన్నం సతీష్ ప్రభాకర్, పేర్లి సునీల్ కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాలు, ప్రధాన కూడళ్ల మీదుగా ప్రచార ర్యాలీని కొనసాగించారు. 44 వార్డుల పరిధిలోనూ పర్యటిస్తూ ఇండిపెండెంట్ అభ్యర్థులకు మద్దతు కోరారు. భారీ సంఖ్యలో వాహనాలు ర్యాలీలో పాల్గొనడంతో పట్టణంలో ఎక్కడ చూసినా ఎన్నికల సందడి కనిపించింది. చైర్మన్ అభ్యర్థి పేర్లి సునీల్తో కలిసి అన్నం సతీష్ స్వయంగా ప్రచారంలో పాల్గొనడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రజలే మా నమ్మకం

ఈ సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజలే తమకు నమ్మకమని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడే వారికి ఎవరూ సహకరించవద్దని పిలుపునిచ్చారు. బాపట్ల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల



సమస్యలను గుర్తించి పరిష్కరించే ప్రతినిధులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మంచి పాలన అందించడమే లక్ష్యం

పార్టీలకు, జెండాలకు అతీతంగా ఇండిపెండెంట్ అభ్యర్థులను గెలిపించుకుని మంచి పాలనకు బాటలు వేయాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలకవర్గం ఏర్పడాలని, ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గకుండా ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. బాపట్ల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.44 వార్డుల మీదుగా సాగిన ఈ భారీ వాహన ర్యాలీతో బాపట్లలో ఎన్నికల ప్రచార వాతావరణం మరింత వేడెక్కింది. అన్నం సతీష్ ప్రభాకర్, పేర్లి సునీల్ కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మాచర్ల మున్సిపల్ చైర్మన్ సుష్మా కేశవరెడ్డికి ఆహ్వానం..!

- శ్రీ హరిహర బాల నాగేంద్రస్వామి వార్షిక మహోత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత
- టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావుకు ఆహ్వాన పత్రిక అందజేత

మాచర్ల, నవంబర్24(అక్షరభూమి): దుర్గి మండలం ధర్మవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ హరిహర బాల నాగేంద్రస్వామి 36వ వార్షిక మహోత్సవాలకు మాచర్ల మున్సిపల్ చైర్మన్ యెనుముల సుష్మా కేశవరెడ్డిలను ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ దంపతులను ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి వారికి ఆహ్వాన పత్రికను అందించారు. వారితోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావును ఉత్సవాలకు ఆహ్వానించి ఆహ్వాన పత్రిక అందించారు. ఎంతో భక్తి, శ్రద్ధలతో నిర్వహించే స్వామివారి వేడుకలకు చైర్మన్ దంపతులు రావాలని వారు కోరారు.



అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
RNI NO: APBIL/2011/37448
Post Regd No. GTR/90/2025-27

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పేద కుటుంబాలకు నిజమైన ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబర్ 24. అక్షర భూమి. ప్రతి ఇంటి నుండి పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే చంద్రబాబు అజెండా – ప్రతి గల్లికి ఒక గూండాను తయారు చేయడమే జగన్ అజెండా అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. మంగళవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం కేవలం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం మాత్రమే కాదని, ప్రతి కుటుంబం ఆరోగ్యవంతంగా, ఆర్థికంగా బలోపేతమై, సంతోషంగా జీవించాలన్నదే ఆయన ఆలోచన అని పేర్కొన్నారు.అందులో భాగంగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం పేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తోందన్నారు. నందమూరి తారక రామారావు ప్రారంభించిన పెన్షన్ విధానాన్ని చంద్రబాబు నాయుడు మరింత బలోపేతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితాన్ని అందించేలా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో విడతలవారీగా కేవలం రూ.250 చొప్పున పెంచుతూ వచ్చిందని, ఎన్నికల ముందు మాత్రమే రూ.3,000 పెన్షన్ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్య, వితంతు తదితర సాధారణ సామాజిక భద్రతా పెన్షన్లను రూ.4,000కు పెంచి నిజమైన సంక్షేమం అంటే ఏమిటో నిరూపించిందన్నారు. ఒంటరి మహిళలకు, వితంతువులకు రూ.6,000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000, దివ్యాంగులకు రూ.10,000 వరకు పెన్షన్లు అందిస్తూ వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తోందని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు, తలసేమియా బాధితులు, పక్షవాతంతో బాధపడుతున్న వారు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో జీవిస్తున్న వారికి వారి పరిస్థితులకు అనుగుణంగా పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమన్నారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు కూడా ప్రత్యేకంగా పెన్షన్లు అందిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ పెన్షన్ల పంపిణీ కోసం రానున్న ఐదేళ్లలో సుమారు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సి ఉన్నప్పటికీ, ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా పేదల సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్లను పెంచడం చంద్రబాబు నాయుడు నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసిందని, ఒకటో తేదీ సెలవు దినమైతే ముందురోజే పంపిణీ చేపడుతోందన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించడం ద్వారా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చేస్తోందని తెలిపారు. ఇది కేవలం నగదు పంపిణీ కాదని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం కల్పిస్తున్న ఆత్మగౌరవం, భరోసా అని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలు, వివక్షతో అర్హులైన వారికి సైతం పెన్షన్లు తొలగించిన సందర్భాలు ఉన్నాయని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. అవసరంలో ఉన్న పేదలకు మాత్రమే ఈ పథకాల ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో అర్హత లేని వారు స్వచ్ఛందంగా పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాల నుంచి తప్పుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే చంద్రబాబు నాయుడు లక్ష్యమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త (ఎంటర్‌ప్రెన్యూర్) ఉండాలనే ఆలోచనతో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సంజీవని కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. అలాగే పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు పి4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటిని ఆరోగ్యవంతమైన, ఆర్థికంగా బలోపేతమైన కుటుంబంగా మార్చాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.



వైసీపీకి ఎమ్మెల్యే గళ్ళా మాధవి సవాల్ :

2029లో మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్న వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సవాల్ విసిరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను అదే విధంగా కొనసాగించే ధైర్యం వైసీపీకి ఉందా అని ప్రశ్నించారు. వృద్ధులకు రూ.4,000, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.6,000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000, దివ్యాంగులకు రూ.10,000, కిడ్నీ, తలసేమియా బాధితులకు ప్రత్యేక పెన్షన్లు అందించే ఈ విధానాన్ని 2029లో అధికారంలోకి వస్తే యథాతథంగా కొనసాగించగలరా? కనీసం ఒక్క నెలైనా ఈ స్థాయిలో పెన్షన్లు అందిస్తూ పరిపాలించగలరా? అని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అనుమానాలు సృష్టించడమే వైసీపీ నాయకుల పనిగా మారిందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ప్రతి ఇంట్లో ఒక ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారు చేయాలని ఆలోచిస్తుంటే, వైసీపీ నాయకులు ప్రతి గల్లీలో ఒక గూండాను తయారు చేయాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే కూటమి పాలనకు, అరాచక ధోరణులకు మధ్య ఉన్న తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని అన్నారు. రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచి విజయాన్ని అందించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు.

ఆదర్శంగా నిలుస్తున్న మ్యాంగో స్ట్రీట్. గుంటూరులో ఇలాంటి వందలాది వీధులు తయారవ్వాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబర్ 24. అక్షర భూమి.గుంటూరులో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న వీధి మ్యాంగో స్ట్రీట్ అని, ఇలాంటి వందలాది వీధులు తయారవ్వాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు జకేసి రోడ్డులోని 54వ డివిజన్ మ్యాంగో స్ట్రీట్, ఎస్.వి.ఎన్. కాలనీలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వన సమారాధన కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, మ్యాంగో స్ట్రీట్, ఎస్.వి.ఎన్. కాలనీ ఆదర్శానికి ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. వీధిలో ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా ప్రతి ఒక్కరూ గ్రూపులుగా విడిపోకుండా ఒకే కుటుంబంలా ఐక్యంగా పాల్గొనడం ఎంతో గొప్ప విషయమన్నారు. గుంటూరులో ఇలాంటి ఐక్యత చాలా అరుదుగా కనిపిస్తుందని, ఈ ఐక్యతను కొనసాగిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఒక వీధిని పచ్చదనంతో తీర్చిదిద్దడమే కాకుండా పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, ఇతర స్థానిక సమస్యల పరిష్కారంలోనూ ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతం ఇప్పుడు కేవలం ఒక వీధికే పరిమితం కాకుండా గుంటూరులోని ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా మారిందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ గుంటూరులో భాగంగా మ్యాంగో స్ట్రీట్‌ను ఆదర్శ ప్రాంతంగా గుర్తించడం సంతోషకరమన్నారు. మ్యాంగో స్ట్రీట్‌లోని కొంతమంది యువత, పెద్దలు ఇతర వీధులకు వెళ్లి అక్కడి ప్రజల్లోనూ పారిశుద్ధ్యం, పచ్చదనం, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే అసలైన మార్పుకు పునాది అని అన్నారు. మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ నగర అభివృద్ధి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతున్నారన్నారు. రామకృష్ణ వంటి పెద్దల సహకారం, ప్రజల భాగస్వామ్యంతో గుంటూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. అభివృద్ధితో పాటు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించాలనే ఆలోచన కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు ఒకే దిశగా ఆలోచించి పనిచేస్తే అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఇటీవల ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎవరూ అభ్యర్థించకపోయినా, ఆటోలు పెట్టి తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలని సూచించారు. ప్రజలు బాధ్యతగా ఓటు వేస్తేనే ఇలాంటి మ్యాంగో స్ట్రీట్లు గుంటూరులో వందల సంఖ్యలో ఏర్పడతాయని అన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికల భద్రత, పోలీస్ బలగాల సమన్వయం కోసం 'సమర్థా' మొబైల్ యాప్ : జిల్లా ఎస్పీ

గుంటూరు, నవంబర్ 24. అక్షర భూమి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ 'సమర్థా' (సమర్థ -- సెక్యూరిటీ ఆరెంజ్మెంట్ మాపింగ్ ఎనాలిసిస్ రెస్పాన్స్ ట్రాకింగ్ హబ్) మొబైల్ యాప్‌ను రూపొందించారు.తాడేపల్లి--మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పర్యవేక్షణ, పోలీస్ బలగాల సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ఈ యాప్ ద్వారా గూగుల్ మ్యాప్స్ సహాయంతో పోలీస్ సిబ్బంది లొకేషన్లను పర్యవేక్షించడం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, మొబైల్ పార్టీలు, ఫ్లైకింగ్ ఫోర్స్ బృందాలను అవసరమైన ప్రాంతాలకు తరలించడం, ఒకే నోటిఫికేషన్ ద్వారా సుమారు 2,000 మంది పోలీస్ సిబ్బందికి సమాచారం చేరవేయడం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.అదేవిదంగా పోలీస్ అధికారుల వివరాలు, మొబైల్ నంబర్లు ఒకే వేదికపై ఉండటంతో పాటు, కంట్రోల్ రూమ్‌తో నేరుగా సంప్రదింపులు, ఎస్ ఓ ఎస్ బటన్ ద్వారా అత్యవసర సమాచారాన్ని చేరవేసే సదుపాయం కూడా ఉంది. ఇంటర్నెట్ సిగ్నల్ అందుబాటులో లేని పరిస్థితుల్లోనూ నోటిఫికేషన్ల ద్వారా సమాచారం చేరవేసే సాంకేతిక సదుపాయం కల్పించారు. ఈ యాప్ వినియోగంపై ఐటీ కోర్ సీఐ నిషార్ భాషా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ముందస్తు చర్యల ద్వారా అవాంఛనీయ సంఘటనలను నివారించడం, ఎన్నికల విధులను వేగవంతంగా, సమన్వయంతో నిర్వహించడమే 'సమర్థా' ముఖ్య ఉద్దేశమని ఎస్పీ తెలియజేశారు.



విద్యార్థినులకు చదువుతోపాటు మానసిక ఆరోగ్యం అవసరం: హెల్త్ కౌన్సిలర్ నవ్య

వెల్దుర్తి కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన
ప్రిన్సిపల్ గంగాభవాని నేతృత్వంలో ప్రోగ్రాం నిర్వహణ



పల్నాడు బ్యూరో, నవంబర్24 (అక్షరభూమి): విద్యార్థినులకు చదువుతోపాటు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని పల్నాడు జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. నవ్య తెలిపారు. వెల్దుర్తి మండలం కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ప్రిన్సిపల్ గంగాభవాని అధ్యక్షతన నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ అధిక వినియోగం, ఏకాగ్రత లోపం, నిద్రలేమి, చదువుపై ప్రభావం, మానసిక ఒత్తిడి అంశాలపై ఆమె అవగాహన కలిగించి తద్వారా కలిగే నష్టాలను వివరించారు. చదువుకునే విద్యార్థినులు మొబైల్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, భయాందోళనకు గురికాకుండా ప్రశాంతత అలవర్చుకోవాలన్నారు. తద్వారా వారి లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం ఆమెకు ప్రిన్సిపల్ గంగాభవాని, అధ్యాపకులు, టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి



బాపట్ల(అక్షర భూమి) నవంబర్ 24 : పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్,వి., పేర్కొన్నారు. మంగళవారం నగరం మండలం అద్దంకి వారి పాలెం గ్రామంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు ను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, వి. పరిశీలించారు. ఈ సందర్భంగా రెండవ సాధారణ స్థానిక సంస్థల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా డిసెంబర్ 02న జరగనున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి నగరం మండలం, అద్దంకి వారి పాలెం గ్రామం నందు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నిచర్, ర్యాంపులు వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నగరం మండల కేంద్రం ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన పంచాయతీ ఎన్నికల కు సంబంధించి మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని మరియు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఉన్న ఎన్నికల మెటీరియల్ ను కలెక్టర్ పరిశీలించారు.జిల్లా కలెక్టర్ వెంట రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిణి బి. శ్రీదేవి, తహశీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

10, 33, 34 వార్డుల్లో ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ, బ్రహ్మానంద రెడ్డి ఇంటింటి ప్రచారం



బాపట్ల(అక్షర భూమి)24.11.26 బాపట్ల మున్సిపాల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 10,33,34 వ వార్డులలో కూటమి అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలగంటి బ్రహ్మానంద రెడ్డి తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు , స్థానిక వార్డులలో పర్యటించారు. వార్డు కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళ్తూ కూటమి మేనిఫెస్టోను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి వార్డుల కౌన్సిలర్ అభ్యర్థి ,కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Billa Raju, D.No : 6-12-51/A, Arundelpet, 12/1, Guntur - 522002, Printed at Sowmya Graphics, D.no : 26-36-72, Ankamma Nagar, Guntur